క్లుప్తంగా

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి జయశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, శాస్త్రవేత్తలు ఆధునిక పద్ధతులపై వ్యవసాయంపై అవగాహన, సాంకేతిక సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. కావున కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

పరిగి: మండల పరిధిలోని సయ్యాద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం అందజేశారు. అనారోగ్యానికి గురై చికిత్సలు చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి తోడ్పాటునిస్తుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు రహీంపటేల్, గ్రామస్తులు రాజు, ఆంజనేయులు, రాములు, కృష్ణయ్య, సాధిక్, దస్తయ్య, నర్సింహులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన నీరు



దుద్యాల్: మండల పరిధిలోని హంసంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం పడితే చాలు రోడ్డుపై మధ్యలో నీరు నిలుస్తుంది. ఇటీవల కురిసిన వానకి రహదారిపై నీరు నిలిచిపోవడంతో అటుగా వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది, అంటువ్యాధులకు కారణం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణం



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ

కుల్కచర్ల: నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని హౌసింగ్ ఏఈ హర్షవర్ధన్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల స్థలాల గుర్తింపు సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు నిర్మించుకుంటున్న స్థలాలను ఆన్‌లైన్ ఎంట్రీ తప్పనిసరి చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను అనుసరించి నిర్మాణాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, కారోబార్ యాదయ్య, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

హిందీ పండితుకు సత్కారం



అహ్మద్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బంట్వారం: కోట్‌పల్లి మండలం ఎన్నారం జెడ్పీహెచ్ఎస్ హిందీ పండిత్ ముక్తార్ అహ్మద్‌ను ఎంఈఓ చంద్రప్ప, ఉపాధ్యాయ బృందం శుక్రవారం ఘనంగా సత్కరించారు. థాయిలాండ్‌లో జరుగుతున్న గోల్డెన్ బుద్ధ ఎడ్యుకేషనల్ అవార్డ్స్‌లో భాగంగా హిందీ పండిత్‌కు డాక్టరేట్ దక్కింది. ఈ సందర్భంగా కోట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఎంఈఓ అహ్మద్‌ను శాలువా పూలమాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, శేఖర్, విశ్వేశ్వర్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, నికాత్‌ఉన్నీసా, గీత, పరమేశ్వరి, విష్ణువర్ధన్, నరేశ్, సీఆర్‌పీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్ షాప్‌లో అమ్మకానికి సిద్ధంగా విత్తనాలు



కొడంగల్‌లో నకిలీ విత్తనాలను పట్టుకున్న పోలీసులు

అవగాహన లేకపోతే ఆగం!

- వెంటాడుతున్న నకిలీ విత్తనాల భయం
- వానాకాలం సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు
- కొనుగోలులో జాగ్రత్తలు పాటించకుంటే తీవ్ర నష్టం
- రసీదులు తప్పనిసరి తీసుకోవాలని అధికారుల సూచన

దుద్యాల్: ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో కర్షకులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం పొలాలను చదును చేసుకోవడంతో పాటు విత్తనాలు, ఎరువుల కొనుగోలు ప్రక్రియలో నిమగ్నమవుతున్నారు. ఈ సమయంలోనే రైతులు తప్పటడుగులు వేసే ఆస్కారం ఉంది. ముఖ్యంగా నకిలీ విత్తనాలను గుర్తించక నష్ట పోయే ప్రమాదం లేకపోలేదు. మార్కెట్‌లో దళారులు తక్కువ ధరను ఆశ చూపి నాసిరకం విత్తనాలను విక్రయిస్తుంటారు. పల్లె ప్రాంతాల్లో రైతులకు మాయమాటలు చెప్పి ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన నకిలీ పత్తి, మొక్కజొన్న విత్తనాలను అంటగడుతున్నారు. ప్రస్తుతం అధికంగా వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు, ఎరువులు, గడ్డి మందులను కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో కర్షకులు జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఫర్టిలైజర్ దుకాణం నుంచే కొనుగోలు చేసేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచిస్తున్నారు.

మోసపోయిన రైతులు

గతంలో కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన రైతులు కొడంగల్‌లోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో వరి విత్తనాలను అధిక దిగుబడి వస్తుందని చెప్పడంతో నమ్మి కొన్నారు. పంట కాలం తర్వాత ఎకరాకు 10 క్వింటాళ్ల ధాన్యం రావడంతో మోసపోయామని గ్రహించిన కర్షకులు 2024 జూన్‌లో కొడంగల్ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేసేందుకు అప్పట్లో ప్రయత్నం చేశారు. అలాగే అంగడిరాయిచూర్‌లో సైతం నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.

అనుమానం వస్తే ఫిర్యాదు

లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక, కలుపు నియంత్రణ మందులు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే వ్యవసాయ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సరుకు లాట్ నంబర్, తయారీ తేదీ, ఏ రకం వంటి విషయాలను పరిశీలించాలి. దుకాణాదారుడు, డీలర్ సంతకం చేసిన ఒరిజినల్ బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలకు సంబంధించిన సంచులపై సీలును విప్పినట్లు అనుమానం వస్తే వాటిని కొనరాదు. నకిలీలపై కర్షకులు ఫిర్యాదు చేయాలి. అధికారుల పరిశీలనలో కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నకిలీవని తేలితే స్థానిక డీలర్‌పై కేసు నమోదు చేసి రైతులకు న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

రసీదులు భద్రపర్చుకోవాలి



ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, కలుపు నియంత్రణ మందులు కొనుగోలు చేయాలి. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు డబ్బాలపై వివరాలను పరిశీలించాలి. అర్థం కాకపోతే తెలిసిన వారికి చూపించాలి. కొనుగోలు చేసిన బిల్లులు, డబ్బాలు, సంచులను పంట దిగుబడి వచ్చేంతవరకు భద్రపర్చుకోవాలి. ఒకవేళ నష్టం వాటిల్లితే సంబంధిత డీలర్‌పై కేసు నమోదు చేస్తాం. – మోహన్‌రెడ్డి , జిల్లా వ్యవసాయ అధికారి

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

- తాండూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్
- డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై అవగాహన



పాత తాండూరులో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తాండూరు: మత్తు పదార్థాలు జీవితాలను చిత్తు చేస్తాయని తాండూరు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బందితో కలిసి డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందిరానగర్, విలియంమూన్ ప్రాంతం, పాత తాండూరు, రాజీవ్ కాలనీలలో పర్యటించి వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయించినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కేసులలో పట్టుబడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రధానంగా పాత తాండూరు, రాజీవ్‌కాలనీ, ఇందిరానగర్ ప్రాంతాలలో గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నారనే సమాచారం ఉందన్నారు. వారికి చైతన్యం కల్పించేందుకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిజామొద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పశుగ్రాసం కొరత

- పొలాల్లోనే గడ్డి వదిలేస్తున్న రైతులు
- ప్రస్తుతం గడ్డిని చుట్టే యంత్రానికి డిమాండ్

దౌల్తాబాద్: ప్రస్తుతం రైతులు హార్వెస్టర్లతో పొలాలు కోయిస్తుండడంతో గడ్డి పొలమంతా పడుతుంది. దీంతో చాలా మంది అన్నదాతలు పొలాల్లోనే ఆ గడ్డిని కాల్చేస్తున్నారు. ఫలితంగా డెయిరీ ఫారం నిర్వాహకులకు, గేదెలు, ఆవులు పెంచే వారికి గ్రాసం కరువైంది. వేసవిలోనైతే పశువులకు బయట పచ్చిగడ్డి లేక ఇంట్లో ఎండు గడ్డిలేక పెంపకందారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ యాసంగిలో వరిపంట ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పశుగ్రాసానికి మరింత డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో అక్కడక్కడ ఉన్న వరిగడ్డిని యంత్రంతో కట్టలు కట్టించి నేరుగా రైతుల ఇళ్లకు చేర్చుతూ పశుగ్రాసం కొరత తీర్చుకుంటున్నారు. సాంకేతిక రంగం కొత్తపుంతలు తొక్కుతున్నా కొద్దీ వ్యవసాయంలో నూతన యంత్రాల వినియోగం పెరుగుతుంది.

యంత్రంతో పని సులువు

గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కటి, రెండు వరి గడ్డి కట్టలు కట్టే యంత్రాలు వచ్చాయి. ఇవి ట్రాక్టర్‌కు అనుసంధానం చేయబడి ఉంటాయి. ట్రాక్టర్ నడుస్తున్న కొద్ది పొలమంతా పడిన గడ్డిని కట్టలు కడుతూ చివరకూ ఊడిపోకుండా తాడు కూడా కడుతుంది. ఎకరం పొలంలోని గడ్డిని గంటలోపే 40–50 కట్టలు కడుతుంది. యంత్రం ద్వారా కట్టలు కట్టినందుకు ఒక్కో కట్టకు రూ.40–50 వరకు తీసుకుంటారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పాడి గేదెలు పెంచేవారు. ముందుగా రైతులతో పొలంలోనే గడ్డిని తీసుకెళ్లేందుకు ఎంతో కొంత డబ్బు చెల్లించి యంత్రంతో కట్టలు కట్టిస్తున్నారు. దీంతో చాలా మంది రైతులు గడ్డిని కాల్చడంలేదు. పొలంలోని గడ్డి కట్టలను పాడి పశువులు ఉండే చోట పెడుతున్నారు. అవసరాన్ని బట్టి పశువులకు పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు.



దౌల్తాబాద్‌లో గడ్డి కట్టలను కడుతున్న యంత్రం

కేంద్రం శాంతి చర్చలు జరపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

- వామపక్ష నాయకుల డిమాండ్

అనంతగిరి: మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో దాదాపు 500 మందికిపైగా ఎన్‌కౌంటర్ పేర్లతో మారణకాండ సృష్టిస్తూ దేశంలో రాజ్యాంగపు హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం తమ చర్యలను వెంటనే ఆపేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మావోయిస్టు పార్టీ చర్చలకు సిద్ధమని ప్రకటించినప్పటికీ కేంద్ర బలగాలతో ఏకపక్షంగా కాల్పులు జరిపి హత్య చేయడం సరికాదన్నారు. తక్షణమే శాంతి చర్చలు జరపాలని కోరాను. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, మల్లేష్, యాదయ్య, దశరథ్, ఆనంద్, ప్రకాష్, నర్సింలు, పెంటన్న, అనంతయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న సప్లిమెంటరీ పరీక్షలు



విద్యార్థులను పరిశీలిస్తున్న కళాశాల సిబ్బంది

కుల్కచర్ల: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరంలో 78 మందికి గాను 5 మందికి గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 11మందికి 11మంది హాజరయ్యారని వివేకానంద జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

పెద్దేముల్‌కు 820 యూనిట్లు మంజూరు

తాండూరు రూరల్: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ప్రభుత్వం పెద్దేముల్ మండలానికి 820 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ రతన్‌సింగ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో బీసీ–244, ఎస్సీ–225, ఎస్టీ–229, ఈబీసీ–55, మైనారీ–61, క్రిస్టియన్ మైనార్టీ–6 యూనిట్లు ఉన్నాయన్నారు. ఇందులో రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు నిరుద్యోగులకు బ్యాంకుల నుంచి ప్రభుత్వం రుణ సాదుపాయం కల్పించనుంది. ఇప్పటికే దరఖాస్తుల పరిశీలిన ప్రక్రియ కొనసాగుతుందని ఎంపీడీఓ తెలిపారు. జూన్ 2వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తికానున్నట్లు తెలుస్తోంది. రాజీవ్ యువ వికాసంకు సంబంధించి మండలంలో 38 గ్రామాల్లోని నిరుద్యోగ యువతి, యువకులు 3184 దరఖాస్తులు చేసుకున్నారన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి



మాట్లాడుతున్న గోపి రజక

- రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక

కొడంగల్ రూరల్: నియోజకవర్గ కేంద్రంలో రజకుల సంక్షేమానికి రెండు ఎకరాల భూమితో పాటు అధునాతన దోబీఘాట్, మినీ ఫంక్షన్ హాల్, సంత్ గాడ్గె బాబ ఆత్మ గౌరవ భవన నిర్మాణం చేపట్టాలని రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్, కుల గురువు డాక్టర్ శ్రీనివాస స్వామిజీ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటుచేసిన జిల్లా రజక రిజర్వేషన్ సమితి సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. దేశంలో 18రాష్ట్రాలలో ఎస్సీలుగా కొనసాగుతూ రజకులు అభివృద్ధిలో కొనసాగుతున్నారని అన్నారు. 11 రాష్ట్రాలలో రజకులు ఓబీసీలు వెనుకబడినారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు ఎలాంటి శరతులు లేకుండా ప్రతీ వృత్తిదారుడికి రూ.2 లక్షల బ్యాంకు రుణాలను ఇప్పించాలని, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని, నిరుద్యోగ రజకులుకు ఆస్పత్రుల్లో, వసతిగృహాల్లో దోబీ పోస్టులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు సి.అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.బాలప్ప, నాయకులు సి.వెంకటప్ప, సుందరప్ప బిచ్చాల్ మొగులయ్య, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా!

- అనుమతి లేని నాపరాతి గనులకు విద్యుత్ సరఫరా బంద్



అక్రమంగా తవ్వకాలు చేపడతున్న గనులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న లైన్‌మెన్

తాండూరు రూరల్: ప్రభుత్వ అనుమతి లేని నాపరాతి గనుల తవ్వకాలపై మైనింగ్ ఏడీ సత్యనారాయణ కొరడా ఝులిపిస్తున్నారు. మండల పరిధిలోని ఓగిపూర్ శివారులో పలు నాపరాతి గనులు అనుమతి లేకుండా తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం అందింది. దీంతో శుక్రవారం ఏడీ సత్యనారాయణ, విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ గరివప్పలు క్షేత్రస్థాయిలో గనులను పరిశీలించారు. అక్రమంగా కొనసాగుతున్న నాలుగు గనులకు సంబంధించి విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు తొలగించామన్నారు.

తడిసిన వడ్లను కొనాలి

తాండూరు రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను నిండా ముంచుతోందన్నారు. ఇప్పటివరకు రైతు బంధు కూడా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. వర్షాలు కురుస్తున్న సందర్భంలో రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్‌ను కలిసి రైతుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమలో బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం, నాయకులు రాంచందర్, నర్సిములు, రమేష్, సాగర్, శంకర్ తదితరులు ఉన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోత్లాపూర్ గ్రామ శివారులో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర కొనసాగుతుంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనంతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. జాతరలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం, సిడే ఊరేగింపు ఈ నెల 30వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈఓ శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ సాయిలు తదితరులు ఉన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో శుక్రవారం టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విచ్చేశారు. టీబీ అలర్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు గోధుమపిండి, బియ్యం, కందిపప్పు, బెల్లం, పల్లీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ విష్ణు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, వైద్య సిబ్బంది రవికుమార్, షఫీ, సంధ్య, అన్వర్, లింగం, గౌస్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి ఏర్పాట్లు

- మండలంలో 2.8 లక్షల మొక్కలు సిద్ధం
- నర్సరీలను పర్యవేక్షిస్తున్న అధికారులు



ప్యాలమద్ది నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో 26 గ్రామ పంచాయతీల్లోని ఒక్కో నర్సరీలో 8 వేల మొక్కల పెంపకం చేపట్టారు. మొత్తం 2లక్షల 8వేల మొక్కలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. నర్సరీలలో ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని అధికారులు పర్యవేక్షించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన రహదారుల పక్కన, పొలాల గట్లపై నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పల్లెలు, పట్టణాలలో మొక్కలను నాటుతూ పచ్చదనం వెల్లివిరిసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడం, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ స్థలాలలో విరివిగా నాటేందుకు చర్యలు చేపడుతున్నారు. నర్సరీలలో పూలు, పండ్లు, గుల్మోర్, నిమ్మ, దానిమ్మ, కానుగ మొక్కలతోపాటు ఇతర వాటిని రెడీ చేశారు. నర్సరీలలో మొక్కల పెంపకానికి కూలీలను పెడుతూ ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. ఎండ వేడిమిని తట్టుకునేందుకు నర్సరీ చుట్టూ గ్రీన్ నెట్ వేస్తూ సమయానికి అనుగుణంగా నీటిని అందిస్తున్నారు. పచ్చదనం వెల్లివిరిసేలా పల్లె, పట్టణాలలో మొక్కలతో కళకళలాడాలనే ఉద్దేశంతో నాటడంతోపాటు వాటిని సంరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పరిరక్షణకు చర్యలు

మండలంలోని 26 గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో 2లక్షల 8వేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. టార్గెట్‌కు అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టాం. ప్రతిఒక్కరూ మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.
– రాములు, ఏపీఓ, కొడంగల్